రెవెన్యూ రికార్డుల పరిశీలన

తాండూరు రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : తాండూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ చంద్రకిరణ్ ఆయనకు వివరించారు. జమాబందీ, పహాణీ నకలు, విరాసత్, ఫైసల్ పట్టి, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్ ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



తుపాను దాటికి మూడు రోజుల నుంచి ధాన్యంపై కవర్లు కప్పి ఉంచాం. రోజూ ఇదే పనిగా పెట్టుకున్నాం. ధాన్యం తడవకుండా కుప్పలపై రెండు మూడు కవర్లు కప్పి ఉంచి పర్యవేక్షిస్తున్నాం. అయినా వరద రాశి కింది రావడంతో ధాన్యం తడుస్తోంది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలి.

-నడిమింటి వెంకటేశ్, రైతు ఎదులాబాద్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అధికారులు, ఉద్యోగులు తమ పరిధిలో సిద్ధంగా ఉండాలి. ప్రధానంగా పోలీస్, రెవెన్యూ, విద్యుత్, సాగునీటి శాఖల సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవాలి. చెరువులు, వాగుల వద్ద భద్రతా ఏర్పాట్లు చేయాలి. వర్షాలు తగ్గే వరకు ప్రజలు ఇళ్లలోనే ఉండాలి. అత్యవసరమైతే మాత్రమే బయటకు రావాలి. రైతులు పంటలను కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవాలి.

-గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనసభ స్పీకర్

జాగ్రత్తలు పాటించాలి



వర్షాల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. వాగులు, చెరువుల వద్ద నిరంతరం నిఘా ఏర్పాటు చేస్తున్నాం. రాకపోకలకు ఆటంకం కలిగించే రోడ్లు వెంటనే మూసి వేసేలా ఆదేశాలు ఇచ్చాం. పొంగిపొర్లుతున్న వాగులు, కాలువలను దాటే ప్రయత్నం చేయొద్దు. పాత భవనాల నుంచి సురక్షిత ప్రదేశాలకు తరలివెళ్లాలి. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712670056 ద్వారా సహాయం పొందవచ్చు.

-నారాయణరెడ్డి, ఎస్పీ, వికారాబాద్

మొంథా తుఫాన్ ప్రభావం ఉమ్మడి జిల్లాలో తీవ్రంగా ఉంది. మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షంతో చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. జనజీవనం స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గ్రామీణ మట్టి రోడ్లు, పట్టణాల అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. కాగ్నాతో పాటు మూసీ, ఈసీ పొంగి ప్రవహిస్తున్నాయి. తుపాను ప్రభావంతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వరిచేలు నేలవాలాయి. తెల్లబంగారం నల్లబారుతోంది. రెండుమూడు రోజుల పాటు వర్షాలు ఇలాగే కొనసాగితే పంటలకు మరింత నష్టం చేకూరు అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పెద్దేముల్ మండలం రుక్మాపూర్‌లో నేలకొరిగిన వరిపంట

అతలాకుతలం!

రైతులను ముంచిన మొంథా తుపాను

చేతికొచ్చిన పంట నీళ్లపాలు

- వేల ఎకరాల్లో పత్తి, మక్క, వరి పంటలకు నష్టం
- పలుచోట్ల తడిసిన.. ఆరబెట్టిన ధాన్యం
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- వెల్లాల్లో అత్యధికంగా 16.5 సెం.మీ వర్షపాతం
- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం
- ఉమ్మడి జిల్లాలో జనజీవనం అస్తవ్యస్తం
- పలు చోట్ల నిలిచిపోయిన రాకపోకలు
- కాగ్నా నదిలో వ్యక్తి గల్లంతు..
- రక్షించిన స్థానిక యువకులు



పెద్దేముల్‌లో తడిసి ముద్దయిన పత్తి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి) : మొంథా తుపాన్ కారణంగా ఉమ్మడి జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు రైతాంగాన్ని కోలుకోకుండా చేస్తున్నాయి. ఇప్పటికే ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్న రైతులు ఇపుడు కురుస్తున్న వర్షాలతో మరింత నష్టపోతున్నారు. ప్రధాన పంటలన్నీ చేతికి అందివచ్చిన సమయంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు రైతుల ఆశలు అడియాసలు చేస్తున్నాయి. పంటలన్నీ కోతదశలో ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే మొక్కజొన్న, వరి పంటల కోతతో పాటు పత్తికాయల తీత మొదలైంది. గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అనేక చోట్ల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అధికారులు పంట నష్టం అంచనా వేస్తున్నారు. వర్షాలు తగ్గితే తప్పా పంట నష్టం అంచనా పూర్తికాదు. స్థానికంగా ఉన్న సమాచారం మేరకు ఉమ్మడి జిల్లాలో వేలాది వేలాది ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. మొంథా తుపాన్ ప్రభావంతో గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అనేక చోట్ల పంటలు నీట మునగడంతో పాటు నేలరాలాయి. ప్రధాన పంటలైన పత్తి, వరి, మొక్కజొన్న పంటలు కోత దశలో ఉన్న విషయం తెలిసిందే. వీటితో పాటు కంది, ఉల్లి, ఇతర ఉద్యాన పంటలు వర్షాలకు దెబ్బతింటున్నాయి. పత్తి పంట నష్టం అధికంగా ఉంది. పత్తి వేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికే తేమ పేరుతో సీసీఐ కొర్రీలు వేధిస్తుండగా, ప్రస్తుత వర్షాలు మరింత నష్టం జరుగుతోంది. వరి పంట కూడా

మిగతా 7వ పేజీలో...



బషీరాబాద్- తాండూరు రోడ్డులో జుంటివాగు పరవళ్లు



ఎదులాబాద్ తిరుమలబండ వద్ద వర్షానికి తడుస్తున్న ధాన్యం కుప్పలు



యాలాల మండలం రాస్నంలో నీటమునిగిన పత్తిపంట



కొడంగల్ మండలం బురాన్‌పూర్ చిన్నవాగులో చిక్కుకున్న కారు



పరిగి మండలం రాఘవాపూర్‌లో దెబ్బతిన్న మొక్కజొన్న పంట

ఎట్టకేలకు పెండింగ్

వేతనాలు విడుదల

అతిథి అధ్యాపకులకు అందనున్న 'గౌరవం'

- ఉమ్మడి జిల్లాకు రూ.1,71,53,142 విడుదలైంది
- గత సంవత్సరం బకాయిలే..
- ఈ ఏడాది వేతనాలకు తప్పని ఎదురుచూపు

వికారాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకుల బకాయి వేతనాలను విడుదల చేస్తూ ఇంటర్మీడియట్ విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించి డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల వేతనాలు విడుదల చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని ప్రభుత్వ కళాశాలల్లో పని చేస్తున్న 163 మంది అతిథి అధ్యాపకులకు రూ.1,71,53,142 విడుదల చేసిన డైరెక్టర్.. జిల్లాలు, కళాశాలల వారీగా బడ్జెట్ కేటాయించారు. 2004, డిసెంబరు నెలలో 23 1/2 రోజులు, 2025 సంవత్సరంలో జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు



సంబంధించిన వేతనాలు విడుదల చేశారు.


ఒక పీరియడ్‌కు రూ.390 చొప్పున

వికారాబాద్ జిల్లాలో 56, రంగారెడ్డి జిల్లాలో 72, మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లాలో 35 మంది చొప్పున అతిథి అధ్యాపకులు ఉన్నారు. వికారాబాద్ జిల్లాకు సంబంధించి 56 మంది

మిగతా 7వ పేజీలో...

జిల్లాల వారీగా విడుదలైన వేతన వివరాలు

జిల్లా	అధ్యాపకులు	వేతనం
రంగారెడ్డి	72	రూ.75,76,848
మేడ్చల్	35	రూ.36,83,190
వికారాబాద్	56	రూ.58,93,104
మొత్తం	163	రూ.1,71,53,142



స్పీకర్‌కు ఆహ్వాన పత్రికను ఇస్తున్న అర్చకులు, అధికారులు

అనంతుడి జాతరకు రండి..

- స్పీకర్‌ను ఆహ్వానించిన అధికారులు, అర్చకులు

వికారాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అనంతగిరి శ్రీ అనంతపద్మనాభ స్వామి దేవస్థానం కార్తీక మాస పెద్ద జాతరకు రావాలంటూ శాసనసభ స్పీకర్‌గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఆలయ అధికారులు, అర్చకులు ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం వారంతా ఆయన అధికార నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు. 15 రోజుల పాటు జరుగనున్న ఈ జాతర ఏర్పాట్లపై ఆలయ దర్మకర్త పద్మనాభం, ఈవో నరేందర్‌లతో స్పీకర్ సమీక్ష జరిపారు. భక్తులకు తగిన వసతి, సౌకర్యాలు కల్పించేలా అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు.

42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీఆర్ కృష్ణ



వికారాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 60 శాతం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం అన్యాయం చేసిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ.ఆర్ కృష్ణ ముదిరాజ్ తీవ్రంగా విమర్శించారు. రిజర్వేషన్ల అమలుకు తక్షణమే సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసి ప్రముఖ బీసీ న్యాయవాదులను నియమించి స్టే తెచ్చి ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల గవర్నర్ ఆర్డినెన్స్ అమలు కాక పోవడం, జీవో నంబర్ 9పై హై కోర్టులో స్టే రావడం, సుప్రీం కోర్టులో సరిగ్గా వాదించక పోవడం వల్లే బీసీలకు నష్టం కలిగిందన్నారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు లేక లక్షలాది నిరుద్యోగులు కష్టాలు పడుతున్నారన్నారు. తక్షణమే అఖిల పక్ష ప్రతినిధులను ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధాన మంత్రి మోదీని కలిసి బీసీలకు రాజ్యాంగ భద్రత కల్పించేలా 9 షెడ్యూల్‌లో చేర్చే బిల్లు ప్రవేశ పెట్టించాలని ఆయన సూచించారు. ఇలా చేయక పోతే లక్షలాది బీసీలు, సగం తెలంగాణ ప్రజలు రోడ్లపైకి వచ్చి ధర్మపోరాటం చేస్తారని ఒక ప్రకటనలో హెచ్చరించారు.



చెక్కు పంపిణీ చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్ అభివృద్ధికి సహకరించాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మున్సిపల్ అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ కోరారు. బుధవారం ఆయన కొడంగల్ శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు కలెక్టరేట్‌లో పరిహారం చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

విద్యాసంస్థలను తరలించొద్దు

కొడంగల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కొడంగల్‌కు మంజూరైన మెడికల్ కళాశాల, గురుకులాలను ఇతర ప్రాంతాలకు తరలించొద్దంటూ కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బుధవారం కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో జేఏసీ ఆధ్వర్యంలో వర్షంలోనే ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. విద్యాసంస్థలను ఇతర ప్రాంతాలకు తరలించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. విద్యాసంస్థలను కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే అన్నీ రంగాల్లో వెనకబాటును ఎదుర్కొంటున్న కొడంగల్‌లో విద్యాసంస్థల తరలింపుతో మరింత వెనకబాటుకు గురవుతుందన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సురేశ్‌కుమార్, రమేశ్‌బాబు, రవినాయక్, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆస్పత్రుల సీజ్

కీసర, 29అక్టోబరు(ఆంధ్రజ్యోతి): కీసరలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులను బుధవారం వైద్యాధికారులు సీజ్ చేశారు. ప్రథమ చికిత్స పేరిట, ఇష్టానుసారంగా వైద్యం చేస్తూ, ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే, ఫార్మసీ, అబార్షన్లు, శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో జిల్లా వైద్యాధికారులు కీసరలో తనిఖీలు చేపట్టారు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న భాస్కర్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్, సుజాత ఆసుపత్రులను సీజ్ చేసి, పోలీస్ కేసు నమోదు చేశారు. అర్హత లేకున్నా వైద్యం చేసినా నకిలీ క్లినిక్‌ల పేరుతో ఆసుపత్రులుగా చలామణి చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి తెలిపారు.



కీసరలో అధికారులు సీజ్ చేసిన ఆసుపత్రి

తాండూరు: వర్షంలో తడుస్తున్న విద్యార్థులు



ఆలస్యంగా సెలవు ప్రకటన

- అధికారుల తీరుపై విమర్శలు
- వర్షంలోనే విద్యార్థులు పాఠశాలలకు.. మళ్లీ ఇళ్లకు
- ప్రశ్నపత్రాలు ఇచ్చి వెనక్కి తీసుకున్న ఉపాధ్యాయులు
- సెలవుపై ముందే ప్రకటన చేయాలంటున్న తల్లిదండ్రులు

వికారాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/తాండూరు : పాఠశాలలకు సెలవు ప్రకటించే విషయంలో జిల్లా ఉన్నతాధికారులు వ్యవహరించిన తీరు పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో మొంథా తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా జిల్లాలో కుండపోతగా వర్షం కురుస్తున్న విషయం తెలిసిందే. వర్షం ప్రభావం తీవ్రంగా ఉన్న జిల్లాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించే అధికారాన్ని

మిగతా 8వ పేజీలో...



అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

సౌకర్యాలు లేక పిల్లలకు తప్పని ఇబ్బందులు

వసతుల్లేని చిన్న గదుల్లో ఇక్కట్లు

6

కీసరగుట్టలో అభివృద్ధి పనులు చేపట్టాలి

మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన ఆలయ చైర్మన్, ఈవో

7

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

● సౌకర్యాల్లేక ఇబ్బందులు



పర్వాపూర్‌లో అద్దె ఇంట్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

కొడంగల్ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఆరు నెలల నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య నేర్పిస్తున్నారు. అయితే పలు కేంద్రాల్లో సమస్యలు వేధిస్తున్నాయి. చాలా కేంద్రాలు అద్దె భవనాల్లో అసౌకర్యాల మధ్య నిర్వహిస్తున్నారు. సిబ్బంది, పిల్లలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొడంగల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో (కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్, దుద్యాల్) 234 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో 10 కేంద్రాలకే సొంత భవనాలు ఉన్నాయి. 91 అంగన్‌వాడీలు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా, 132 అంగన్‌వాడీ కేంద్రాలు ప్రభుత్వ పాఠశాల్లో నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే 14అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, 74 చోట్ల ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

వసతుల్లేని చిన్న గదుల్లో ఇక్కట్లు

అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఆట స్థలాలు లేవు. చిన్న గదుల్లోనే చిన్నారులను ఆడిస్తున్నారు. మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం అంతంత మాత్రమే. ఇళ్లకు దూరంగా ఉన్నాయి. ఆయాలు ఉన్న చోట్ల మాత్రమే పిల్లలను ఆడిస్తున్నారు. కేంద్రాల వద్ద ఆట పరికరాలు లేవు. ఈ సమస్యల మధ్య చిన్నారులను కేంద్రాలకు పంపేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడంలేదు.

ప్రీ రిపబ్లిక్ డే క్యాంప్‌నకు అనురాగ్ విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీకి చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు అజయ్‌విక్రమ్, పూర్ణశ్రీ గుజరాత్‌లో జరుగనున్న ప్రీ రిపబ్లిక్‌డే క్యాంప్‌నకు ఎంపికయ్యారు. ఈ నెల 31 నుంచి వచ్చే నెల 9 వరకు జరుగనున్న ప్రీ రిపబ్లిక్ డే క్యాంప్‌నకు బుధవారం బయలుదేరి వెళ్లినట్లు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సి.మల్లేష్ తెలిపారు. ప్రీ రిపబ్లిక్‌డే క్యాంప్‌కు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ విజయకుమార్, కో-ఆర్డినేటర్లు సంతోష్‌కుమార్, పురుషోత్తం పాల్గొన్నారు.



ప్రీ రిపబ్లిక్ డే క్యాంప్‌నకు ఎంపికైన వలంటీర్లు

మహిళలకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే శంకర్

● రూ.1.26కోట్ల విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ




స్థానిక నాయకులతో కలిసి కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మహిళల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పేదింటి ఆడపిల్లల వివాహాలకు ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకూడదని ఎన్ని ఇబ్బందులున్నా సకాలంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్నామని తెలిపారు. బుధవారం షాద్‌నగర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో ఫరూఖ్‌నగర్ మండలం, షాద్‌నగర్ టౌన్, కేశంపేట మండలాలకు సంబంధించి 126 మందికి రూ.1.26కోట్ల విలువ గల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజలకు అండగా ఉండేందుకే రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తమ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోపే అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లను కట్టిస్తోందని, కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేసి కోట్లాది మంది ప్రజలకు ఉచిత సన్నబియ్యం, మహిళలకు బస్సు ప్రయాణం వంటి అనేక పథకాలను అమలుచేస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ నాగయ్య, ఎంపీడీవో బన్సీలాల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, ఫరూఖ్‌నగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కార్యకర్తలు, భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

శ్రీరాముల గుట్టకు సీసీ రోడ్డు వేయించాలి

● ఎంపీ ఈటల రాజేందర్‌కు విన్నవించిన లక్ష్మాపూర్ గ్రామ నాయకులు



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, లక్ష్మాపూర్ గ్రామ నాయకులు

శామీర్‌పేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అస్తవ్యస్తంగా, గుంతలుగా ఉన్న శ్రీరాముల గుట్ట రోడ్డును సీసీ రోడ్డుగా మార్చాలని గ్రామ నాయకులు, భక్తులు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు మొరపెట్టుకున్నారు. బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, జిల్లా మహిళామోర్చ నాయకురాలు విజయలక్ష్మి, బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్‌గౌడ్, మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ నాయకులు, భక్తులు ఎంపీ రాజేందర్ నివాసానికి వెళ్లి కలసి వినతిపత్రం అందజేశారు. రాముల గుట్టకు వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు, భక్తులు ఇక్కట్లకు, అవస్థలకు గురవుతున్నారని ఎంపీకి వివరించారు. రాములగుట్టకు అవసరమైన సీసీ రోడ్డును ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని రాజేందర్‌ను కోరారు. ఎంపీ స్పందిస్తు త్వరలో రాములగుట్టకు సీసీ రోడ్డును ఏర్పాటుకు కృషిచేస్తానని నాయకులకు, గ్రామస్తులకు హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి ఆహ్వానాన్ని అందజేస్తున్న పాంబండ ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి, ఈవో బాల్‌నర్సయ్య

పాంబండ ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

కులకచర్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పాంబండ ఆలయంలో జరిగే ఉత్సవాలకు రావాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని పాంబండ ఆలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి, ఈవో బాలనర్సయ్య కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. నవంబరు 5న జరిగే గిరి ప్రదక్షిణ, సాయంత్రం జరిగే కార్తీక దీపారాధన మహోత్సవం, 17న జరిగే లక్షబిల్వర్చన కార్యక్రమాల్లో పాల్గొనాలని వారు ఆహ్వానించారు. దీపారాధన 25వేల దీపాలతో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యేకు తెలిపారు. ఇందుకు రామ్మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పాండుశర్మ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు

దోమ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దోమ మండలంలోని అయినాపూర్ గ్రామంలోని ఒకటో వార్డులో ఉన్న మినీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాలనీకి రెండు రోజులుగా విద్యుత్ సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై కాలనీవాసులు మాట్లాడుతూ.. గ్రామానికి లైన్‌మన్ ఉన్నా విద్యుత్ సమస్యపై పట్టించుకోవడం లేదన్నారు. లైన్‌మన్ ఉన్న గ్రామంలోనే ఇలాంటి సమస్య ఎదుర్కొంటున్నామని వాపోయారు. సమస్యపై ఎన్నిసార్లు చెబుతున్నా పరిష్కరించడం లేదని కాలనీ వాసులు అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి

● ఎకరానికి రూ.50వేల పరిహారం ఇవ్వాలి



నరసింహయాదవ్

కేశంపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యాక్షుడు పసుల నరసింహయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కొత్తపేటలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టపోయిన పత్తి రైతులకు ఎకరానికి రూ.50వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఫసల్ బీమా అమలు చేస్తే రైతులకు విపత్తు కాలంలో మేలు జరిగేదన్నారు. ప్రభుత్వం వెంటనే అధికారులతో పంటల నష్టం వివరాలు సేకరించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

‘బీజేపీ గుప్పిట్లో రాజ్యాంగ వ్యవస్థలు’

మొయినాబాద్ రూరల్, అక్టోబరు 29(ఆంధ్యజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను తన గుప్పెట్లో పెట్టుకుందని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీసతీష్ ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేస్తోందని ఆరెస్సెస్, బీజేపీలపై లౌకిక, వామపక్ష, ప్రజాతంత్ర శక్తులన్నీ కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌ను(ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) అమలు చేయాలన్న కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం సరి కాదన్నారు. ఓటర్ల జాబితాల సవరణలో ఈసీ విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న బిహార్‌లో పెద్ద సంఖ్యలో మహిళలు, మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీల ఓట్లను తొలగించారని గౌరీసతీష్ విమర్శించారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



నవీన్‌యాదవ్‌ను కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు

మొయినాబాద్ రూరల్, అక్టోబరు 29(ఆంధ్యజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజాపాలనపై వివరించాలని జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ అన్నారు. బుధవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌లో నవీన్‌యాదవ్‌ను కలిసి ఆయనకు మద్దతుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో ప్రచారం నిర్వహించారు. నవీన్‌యాదవ్ మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చిందని వాటిని ప్రజలకు వివరించి ఓట్లు అర్థించే బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని చెప్పారు. 10ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కుటుంబ పాలన గురించి కూడా ప్రజలకు వివరించాలని సూచించారు. తనకు మద్దతుగా మొయినాబాద్ మండలం నుంచి వచ్చి ప్రచారం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. నవీన్‌యాదవ్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు గొంటి శ్రీనివాస్‌యాదవ్, పల్లగొల్ల అశోక్‌యాదవ్, భైకని మల్లేష్ యాదవ్, అత్తపురం సదానందంగౌడ్, తదితరులు ఉన్నారు.

రుణ లక్ష్యాలను పూర్తి చేయాలి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌డీఎం యాదగిరి

పరిగి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రైతులకు, నిరుద్యోగులకు ప్రభుత్వం నిర్దేశించిన రుణ లక్ష్యాలను అన్ని బ్యాంకుల వారు గడువులోపు పూర్తి చేయాలని లీడ్ బ్యాంకు మేనేజర్ యాదగిరి సూచించారు. బుధవారం పరిగి మండల పరిషత్‌లో జరిగిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ శాఖల పరిధిలో ఉన్న యూనిట్లను గ్రౌండింగ్ చేయాలన్నారు. అన్ని శాఖల వారీగా ఇచ్చిన టార్గెట్లను డిసెంబరు చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు సకాలంలో అందించాలన్నారు. పేద, మధ్య తరగతి వర్గాల ఆర్థిక పురోగతికి అన్ని శాఖలు సంయుక్తంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం నర్సింహులు, మెప్మా పీడీ రవికుమార్, ఏపీఎంలు, బ్యాంకులు మేనేజర్లు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి,మంత్రి పొన్నం ప్రభాకర్

విపక్షాల కుట్రలను తిప్పికొట్టాలి

» మంత్రి పొన్నం ప్రభాకర్

ఆమనగల్లు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విపక్షాల కుట్రలు, విష ప్రచారాన్ని కాంగ్రెస్ శ్రేణులు సమర్థంగా తిప్పికొట్టాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. కడ్తాల్ మండలం రావిచెడ్‌కు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు బుధవారం గాంధీభవన్‌లో మంత్రి పొన్నం, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. 22 నెలల్లో సీఎం నేతృత్వంలో కొనసాగుతున్న ప్రజా పాలనకు ప్రజా మద్దతు వస్తోందని చెప్పారు. స్థానిక సంస్థల పదవుల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పించి అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం తథ్యం అన్నారు. సీఎం సొంత ప్రాంతం కల్వకుర్తి వేగంగా అభివృద్ధి సాధిస్తోందన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యనాయక్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికాంత్‌గౌడ్, నాయకులు మహేందర్‌రెడ్డి, విఠలయ్యగౌడ్, కృష్ణానాయక్, షాబుద్దీన్, బాలరాజు ఉన్నారు.

వీధి కుక్కల దాడిలో మేక పిల్లల మృతి



దౌల్తాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో మేకలు మృతి చెందాయి. దౌల్తాబాద్ మండల కేంద్రంలో కుర్వ మాసని ఆశప్పకు చెందిన మేక పిల్లలను ఇంటి దగ్గర ఉన్న గుడిసెలో ఉంచాడు. బుధవారం మధ్యాహ్న సమయంలో వీధి కుక్కలు దాడి చేయగా 20 మేక పిల్లలు మృతి చెందాయి. ఈ ఘటనలో రూ.50వేల వరకు నష్టం జరిగిందని బాధితుడు ఆశప్ప వాపోయాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని వేడుకొన్నాడు.

కీసరగుట్టలో అభివృద్ధి పనులు చేపట్టాలి

కీసర, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఆలయ చైర్మన్, ఈవోలు దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు నందీశ్వరుని విగ్రహం నుంచి తామర కొలను వరకు రోడ్డు వెడల్పు చేయాలని కోరారు. అలాగే ఆలయ తూర్పు, పశ్చిమ గోపురాల వద్ద సీసీ రోడ్డు వేయాలని ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ, ఈవో సుధాకర్‌రెడ్డి దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకటరెడ్డికి ఆలయ నిర్వాహకులు వినతిపత్రం అందజేశారు.

ఎన్నికేదైనా విజయం బీఆర్ఎస్‌దే



సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

చేవెళ్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం అని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బుధవారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గోనె కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రావులపల్లికి చెందిన 50మంది కాంగ్రెస్ నాయకులు సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. తమ అధినేత కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం అన్నారు. కాంగ్రెస్ పాలకులు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలేదని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్ గెలుపు ఖాయం అన్నారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ చేవెళ్ల మండలాధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు వై.కృష్ణ, శేరి స్వర్ణలతదర్శన్, వంగ శ్రీధర్‌రెడ్డి, నరేందర్, నర్సింగ్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పత్తి రైతులను ఆదుకోవాలి



తీగాపూర్‌లో పత్తి పంటను పరిశీలిస్తున్న పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి

కొత్తూర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలకు పత్తి పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తీగాపూర్‌లో వేసిన పత్తి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏరేందుకు వచ్చిన పత్తి వర్షాలకు పాడవుతోందని, పత్తి తడిసి తీసుకునే వీలేలేకుండా పోయిందన్నారు. మొక్కలపైనే పత్తి మొలకెత్తుతోందని చెప్పారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో వేలాది ఎకరాల్లో పత్తి చేలు కోతకొచ్చిన సమయంలో వర్షంతో చేతికి రాకుండా పోయిందన్నారు. పత్తి పంట దెబ్బతిన్నా అధికారులు పరిశీలించడం లేదన్నారు. పాడైన పంటల వివరాలను తెప్పించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతులకు పరిహారం ఇవ్వాల్సి వస్తుందనే ప్రభుత్వం నివేదికలు తెప్పించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా పంటల వివరాలను సేకరించి నష్టపరిహారం చెల్లించాలని, పాడైన పత్తి చేను ఎకరానికి 50వేల చొప్పున పరిహారం ఇవ్వాలని విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు.

విద్యార్థినులు శ్రద్ధగా చదవాలి

శామీర్‌పేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కళాశాల విద్యార్థినులు అధ్యాపకులు బోధించిన పాఠ్యాంశాలను శ్రద్ధగా చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని గురుకుల మహిళా డిగ్రీ కాలేజి వైస్‌ప్రిన్సిపల్ చేతన అన్నారు. బుధవారం మహిళా కళాశాలలో వైస్‌ప్రిన్సిపల్, అకడమిక్ వైస్ ప్రిన్సిపల్ మేఘాస్రవంతిల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ పార్టీని నిర్వహించారు. విద్యార్థునులు ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. సమావేశంలో వైస్‌ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జాతీయ, రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించి ఈ కాలేజి విద్యార్థినులు ఆదర్శవంతంగా నిలవాలని కోరారు. కళాశాల కల్చరల్ కోఆర్డినేటర్స్ ధనవేణి, అధ్యాపకులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న విద్యార్థినులు

ఎట్టకేలకు పెండింగ్
వేతనాలు విడుదల

(ఐదో పేజీ తరువాయి)



అతిథి అధ్యాపకులకు రూ.58,93,104, రంగారెడ్డి జిల్లాలో 72 మందికి రూ.75,76,848, మేడ్చల్ జిల్లాలో 35 మంది అధ్యాపకులకు రూ.36,83,190 బకాయి వేతనం విడుదల చేశారు. ఒక పీరియడ్‌కు రూ.390 వంతున నెలకు రూ.28,080లకు మించకుండా వేతనం చెల్లించాలని విడుదల చేసిన ఉత్తర్వుల్లో సూచించారు. ఒక అతిథి అధ్యాపకుడు నెలకు 72 పీరియడ్ల కంటే మించకుండా బోధన చేయాల్సి ఉంటుంది.

ఈ సంవత్సరం వేతనాలు ఎప్పుడో?

తమకు రావాల్సిన వేతన బకాయిలు మొత్తం కాకుండా కేవలం గత విద్యా సంవత్సరం బకాయి వేతనాలు మాత్రమే విడుదల చేయడం పట్ల అతిథి అధ్యాపకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎనిమిది నెలల వేతనాలు చెల్లించాల్సి ఉండగా, గత సంవత్సరానికి సంబంధించిన నాలుగు నెలల వేతనం చెల్లించి, ఈ ఏడాది వేతనాలు పెండింగ్‌లో పెట్టడంపై మండిపడుతున్నారు. నెల నెలా చెల్లించాల్సిన వేతనాలను నెలల తరబడి విడుదల చేయకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర ఉద్యోగుల మాదిరిగానే తమకూ నెలనెలా వేతనం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

నిబంధనలు పాటించని ట్రావెల్స్ బస్సులపై కేసులు



ప్రైవేట్ బస్సులను ఆపి కేసులు రాస్తున్న రవాణా శాఖాధికారులు

పేట్ బషీరాబాద్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని ఆరు బస్సులపై మేడ్చల్ ఆర్టీఏ అధికారులు కేసులు నమోదు చేశారు. ఇటీవల కర్నూలులో జరిగిన ట్రావెల్స్ బస్సు ప్రమాదం నేపథ్యంలో మేడ్చల్ జిల్లా రవాణా శాఖ అధికారి రఘునందన్‌గౌడ్ ఆధ్వర్యంలో 44వ నంబరు జాతీయ రహదారిపై కండ్లకోయ వద్ద ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. యూనిఫామ్, ఫైర్‌సేఫ్టీ, గూడ్స్ సరుకులను తరలిస్తున్న వాహనాలపై కేసులు రాసి జరిమానా విధించారు. ఇప్పటి వరకు మేడ్చల్ జిల్లాలో 26 బస్సులపై కేసులు నమోదు చేశామని, వాటిపై రూ.85వేల జరిమానా విధించినట్లు ఎంవీఐలు సాదుల శ్రీనివాస్, త్రివేణి, శిల్ప, కిరణ్‌కుమార్, లావణ్య తెలిపారు. ప్రతీ ప్రైవేట్ బస్సుల నిర్వాహకులు ఆర్టీఏ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, డబ్బుల ఆశకుపోయి ఇబ్బందులు పడొద్దని సూచించారు. ట్రావెల్స్ యజమానులు వారి బస్సులకు అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించుకొని ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేయాలని సూచించారు.

అతలాకుతలం!

(ఐదో పేజీ తరువాయి)



పరిగి మండలంలో నేలకొరిగిన వరి చేను

చేతికి అందుతున్న సమయంలో వర్షాలు నిండా ముంచుతున్నాయి. అనేక చోట్ల వరి కోతలు ప్రారంభమయ్యాయి. ధాన్యంను విక్రయించేందుకు రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ఆరబోస్తున్నారు. అలాగే మొక్కజొన్న రైతులు కూడా కోతకోసి ఆరబెడుతున్నారు. ఇపుడు పడుతున్న వర్షాల నుంచి కాపాడుకునేందుకు రైతులు ధాన్యం కుప్పలను కవర్లతో కప్పి ఉంచుతున్నారు. అయితే కొన్నిచోట్ల అధిక వర్షాల కారణంగా ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయింది. మరికొన్ని చోట్ల ధాన్యంపై కవర్లు వేసి కాపాడుకుంటున్నప్పటికీ తేమ శాతం పెరిగి నష్టం జరుగుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వెల్జాల్లో అత్యధిక వర్షపాతం

ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లాలో తుపాన్ ప్రభావం ఇంకా కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో అత్యధికంగా తలకొండపల్లి మండలం వెల్జాల్లో 16.5 సెం.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా చూస్తే తలకొండపల్లిలో 15.7 సెం.మీ, ఆమనగల్ 9.7 సెం.మీ, శంషాబాద్ 8 సెం.మీ, మంచాల 7.8సెం.మీ, కేశంపేట 7.6 సెం.మీ, యాచారం 7.2 సెం.మీ, కొందుర్గు 6.7 సెం.మీ, మాడ్గుల 6.5 సెం.మీ, కడ్తాల్ 6.4 సెం.మీ, గండిపేట 6సెం.మీ, రాజేంద్రనగర్ 5.8 సెం.మీ, మహేశ్వరం 5.7 సెం.మీ, బాలాపూర్ 5.7 సెం.మీ, కొత్తూరు 5.6 సెం.మీ, అబ్దుల్లాపూర్‌మెట్ 5.2 సెం.మీ, ఫరూఖ్‌నగర్ 5.1 సెం.మీ, ఇబ్రహీంపట్నం 5 సెం.మీ, నందిగామ 4.8 సెం.మీ, కందుకూరు 4.7సెం.మీ, శేరిలింగంపల్లి 4.6సెం.మీ, చౌదరిగూడ 4.5 సెం.మీ, హయత్‌నగర్ 4.3 సెం.మీ, మొయినాబాద్ 3.8 సెం.మీ, షాబాద్ 3.5 సెం.మీ, సరూర్‌నగర్ 4.31 సెం.మీ, శంకరపల్లి 3.2 సెం.మీ, చేవెళ్ల 3.1 సెం,మీ వర్షపాతం నమోదైంది. బుధవారం రాత్రి ముసురు కొనసాగుతుండడంతో వర్షపాతం మరింత పెరిగే అవకాశం ఉంది.

నల్లబారుతున్న తెల్లబంగారం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో అధికంగా పత్తి పంటకు ఎక్కువ నష్టం జరుగుతోంది. ఇప్పటికే గతంలో కురిసిన వర్షాల కారణంగా పంట దెబ్బతింది. ఇపుడు ఎడతెరిపి లేకుండా వర్షాలతో మిగిలిన పంట కూడా తడిసి ముద్దై నేలరాలిపోతోంది. ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా రైతులు పత్తిపంటనే సాగు చేశారు. దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. పత్తి పంట నష్టం వేల ఎకరాల్లో ఉండే అవకాశం ఉంది. గతంలో కురిసిన అతివృష్టి వల్ల పత్తి దిగుబడులు 30శాతానికిపైగా తగ్గుతాయని అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో దిగుబడులు 50శాతానికి పైగానే తగ్గే అవకాశాలు ఉన్నాయి. గతంలో కురిసిన అధికవర్షాలకు కాయలు నల్లబడి రాలిపోయాయి. గతంలో వర్షాలను తట్టుకుని నిలిచిన పంట కూడా ఇపుడు పడుతున్న వానలకు తడిసి నేలరాలుతోంది. ఇప్పటికే చాలాచోట్ల పత్తి నల్లబారింది. ఈ వర్షాలు రెండు మూడు రోజుల పాటు ఇలానే కొనసాగితే మిగిలిన పత్తి కూడా నల్లబారి విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉంది. కళ్ల ముందే పంట నేలరాలడంతో రైతులు ఆందోళన పడుతున్నారు.

వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ....

వికారాబాద్ జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో అత్యధికంగా పూడూరు మండలంలో అత్యధికంగా 10 సెం.మీ వర్షపాతం నమోదైంది. అలాగే మోమిన్‌పేట మండలంలో 8.8 సెం.మీ, ధారూర్‌లో 7.3 సెం.మీ, యాలాల్‌లో 7.2సెం.మీ, కుల్కచర్లలో 6 సెం.మీ, పరిగిలో 5.5 సెం.మీ, చౌడాపూర్‌లో 4.8 సెం.మీ, కోట్‌పల్లిలో 4.5 సెం.మీ, వికారాబాద్‌లో 8.6 సెం.మీ, నవాబుపేటలో 3 సెం.మీ, కుల్కచర్లలో 4.6 సెం.మీ, బొమ్మరాశిపేటలో 4.5 సెం.మీ, పరిగిలో 6.6 సెం.మీ, తాండూరులో 4.6 సెం.మీ వర్షం కురిసింది. ఇక మేడ్చల్ జిల్లాలో కూడా ముసురు పట్టింది. ఇక్కడ దాదాపు అన్ని మండలాల్లో 2 నుంచి 3 సెం.మీ వర్షపాతం నమోదైంది.

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఉమ్మడి జిల్లాలో వాగులు, వంకలు పొంగిపోర్లుతున్నాయి. కాగ్నాతో పాటు మూసీ, ఈసీ పొంగి ప్రవహిస్తున్నాయి. ఈసీవాగు నిండుగా పారడంతో వెంకటాపూర్, అమ్డాపూర్ వద్ద పంటలు నీట మునిగాయి. భారీ వర్షాలకు కోట్‌పల్లి ప్రాజెక్టులోకి వరద నీరు చేరి అలుగు పోస్తోంది. దీంతో నాగసమందర్, బంట్వారం, కోట్‌పల్లి, పెద్దేముల్ ప్రాంతాల వైపు ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయి వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వికారాబాద్‌లోని శివసాగర్ చెరువుతోపాటు సర్పన్‌పల్లి ప్రాజెక్టులు అలుగు పారి ప్రవహించాయి. మద్గుల్ చిట్టంపల్లి వాగు, గిరిగేట్‌పల్లి వాగు, బూర్గుపల్లి వాగు, గోధుమగూడ వాగు ఉధృతంగా ప్రవహించాయి. మాడ్గుల మండలంలోని సుద్దపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అలాగే బషీరాబాద్‌లోని జుంటివాగు, యాలాల్‌లోని విశ్వనాథ్‌పూర్ వాగుతో పాటు ఆమన్‌గల్ మండలం మేడిగడ్డ తండాలోని కత్వా వాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం వీరశెట్టి గ్రామ సమీపంలో కాగ్నా నదిలో కొట్టుకుపోతున్న ఓ వ్యక్తిని స్థానికులు కాపాడారు. యాలాల మండలం ఆగనూరుకు చెందిన నర్సప్ప ప్రమాదవశాత్తు నదీ ప్రవాహంలో చిక్కుకుని నీటిలో కొట్టుకుపోతుండగా అతన్ని గమనించిన వీరశెట్టి గ్రామ యువకులు రక్షించారు. యువకుల సాహసంతో ఇతను ప్రాణాలతో బయటపడ్డాడు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో
బుల్లెట్ కలకలం

» ప్రయాణికుడి బ్యాగులో లభ్యం

శంషాబాద్ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ ఎయిరంర్‌పోర్టులో బుల్లెట్ కలకలం రేపింది. ఈ సంఘటన బుధవారం ఆర్జీఐఏ ఔట్ పోస్టు పోలీస్ స్టేషన్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 28వ తేదీన కోల్‌కతాకు చెందిన విశాల్ అనే ప్రయాణికుడు 6ఈ6709 విమానంలో కోల్‌కత్తా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాడు. ఎయిర్‌పోర్టులో ఐఎల్‌బీఎస్ సెక్యూరిటీ సిబ్బంది అతని బ్యాగులు స్కాన్ చేయగా అందులో 38 ఎంఎం బుల్లెట్ లభించింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు విచారణ చేపట్టారు. బుధవారం హైదరాబాద్ నుంచి బెంగళూర్‌కు బయల్దేరడానికి 6ఈ 887 విమానం టికెట్ బుక్ చేసుకున్నాడు. నిందితుడి బ్యాగులోకి బుల్లెట్ ఎలా వచ్చింది? ఎందుకోసం తీసుకెళ్తున్నాడు ? అనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. బుల్లెట్‌తో పట్టుబడిన వ్యక్తి బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుండగా, తండ్రి ఆర్మీలో ఉన్నట్లు సీఐ కనకయ్య తెలిపారు.

విమానంలో ప్రయాణికుడికి
గుండెపోటు

» ఆస్పత్రికి తరలింపు

» అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించిన వైద్యులు

శంషాబాద్ రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జెడ్డా నుంచి శంషాబాద్ వస్తున్న విమానంలో ప్రయాణికుడికి గుండెపోటు వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. జెడ్డా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న 6ఈ 68 ఇండిగో విమానంలో నగరంలోని అంబర్‌పేటకు చెందిన మహ్మద్ ఖాసీం(79)కు ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది పడ్డాడు. మరికొద్ది సేపట్లో విమానం ల్యాండ్ అవుతుందనగా అతని ఛాతిలో నొప్పి వస్తున్నట్లు ఎయిర్‌లైన్స్ సిబ్బందికి చెప్పాడు. వారు అతనికి సీపీఆర్ చేశారు. అప్పటికే ఆయన పరిస్థితి విషమించింది. ఉదయం 9.27 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం ల్యాండ్ అయిన వెంటనే హుటాహుటిన ఎయిర్‌పోర్టులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఖాసీంను పరిశీలించిన డాక్టర్లు గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. మెడికల్ ఫార్మాలిటీస్ కంప్లీట్ చేసుకుని మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రయివేట్ అంబులెన్స్‌లో అంబర్‌పేటకు తరలించారు.

అర్హులందరికీ
ఇందిరమ్మ ఇళ్లు

తలకొండపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పేదల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇండ్లు అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఇల్లు లేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన కట్టిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. తలకొండపల్లి మండలం చుక్కాపూర్‌లో బుధవారం ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దాసరి యాదయ్య, ఏమిరెడ్డి రంగారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకుడు నరసింహ, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో
ఆనందమయ జీవనం



ధ్యాన శిక్షణలో అధికారులు

ఆమనగల్లు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మానసిక వికాసం, ఆనందమయ జీవనం, ఆరోగ్య సమాజ నిర్మాణానికి ధ్యానం గొప్ప మార్గమని ఎంపీడీవో కుసుమమాధురి, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, ఎస్సై వెంకటేశ్ అన్నారు. మానవళి సన్మార్గ పురోగమనానికి, సమాజ శాంతి స్థాపనకు ఆధ్యాత్మిక, ధ్యాన కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఆమనగల్లు మండల పరిషత్‌లో బుధవారం హార్ట్‌ఫుల్నెస్ శ్రీరామ మిషన్ ఆధ్వర్యంలో ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. శిక్షకులు నాగరాజు, విజయ్, తులసి, సంధ్యారాణి, సత్యనారాయణలు ఉద్యోగులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో వినోద, ఏపీవో మాధవరెడ్డి, ఏఈలు అభిషేక్, శాలిని, వైద్యులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ ఆధీనంలోకి నవీ ముంబయి ఎయిర్‌పోర్టు

» 71 ఎయిర్ పోర్టుల్లో సీఐఎస్ఎఫ్ సేవలు

» సీఐఎస్ఎస్ డీజీ ప్రవీర్ రంజాన్



నవీ ముంబయి ఎయిర్‌పోర్టు తాళం సీఈవో శర్మకు అందజేస్తున్న సీఐఎస్ఎఫ్ డీజీ ప్రవీర్‌రంజన్

శంషాబాద్‌రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాల(సీఐఎస్ఎఫ్) ఆధీనంలోకి నవీ ముంబయి ఎయిర్‌పోర్టు వచ్చింది. బుధవారం నవీ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్ అధికారులు నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐఎస్ఎస్ డీజీ ప్రవీర్ రంజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో ఇప్పటికే 70 అంతర్జాతీయ విమానాశ్రయాల్లో మా సేవలు కొనసాగుతుండగా, నావి ముంబయితో ఆ సంఖ్య 71 చేరుకుందని చెప్పారు. ఈ ఎయిర్‌పోర్టులో ఇప్పటికే 900 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామని, మున్ముందు మరికొంత మందిని నియమిస్తామని ఆయన పేర్కొన్నారు. నావి ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం కీ(తాళం)ను సీఏఎస్‌వో సీనియర్ కమాండెంట్, సీఐఎస్ఎఫ్ యూనిట్ ఏఎస్‌జీ సునీత్ శర్మకు తాళం అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. భద్రతా ఏర్పాట్లు బీసీఏఎస్ మార్గదర్శకాలను అనుసరిస్తాయని చెప్పారు. ఇవి కోర్ అండ్ నాన్ కోర్ ప్రాంతాలను కవర్ చేస్తాయని చెప్పారు. స్థానిక పోలీసులతో పాటు, ఇతర ఏజెన్సీల సమన్వయంతో సీఐఎస్ఎఫ్ పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీజీ (ఎయిర్‌పోర్టు) బినితా ఠాకూర్, సీవో బీవీజేకే శర్మ, సీఐఎస్ఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి
సొంత ఆదాయ వనరులు కీలకం

» రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహారెడ్డి

కడ్తాల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి సొంత ఆదాయ వనరులు కీలకమని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి అన్నారు. జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ వికాస్ ఆడిటోరియంలో హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన పంచాయతీరాజ్ సీనియర్ అధికారులతో ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 ద్వారా పంచాయతీలకు ఉన్న వివిధ అధికారాలు, వినియోగాల గురించి వివరించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ ద్వారా సొంత ఆదాయ వనరుల పెంపులో భాగంగా ఇంటి పన్ను, వినోదపు పన్ను, వారాంతపు సంత, వృత్తి వ్యాపార లైసెన్స్‌ల మంజూరు ద్వారా వచ్చే వివిధ ఆదాయ వనరుల వివరాలు, పన్నుల వసూలుకు తీసుకున్న జాగ్రత్తల గురించి వివరించినట్లు తెలిపారు. సమావేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 40 మంది అధికారులు, కన్సల్టెంట్‌లు పాల్గొన్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల భాగస్వామ్యంతో పాటు సొంత ఆదాయ వనరుల కూర్పు కూడా ముఖ్యమని తెలిపినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పాలకవర్గం సమష్టి కృషి, ప్రజల భాగస్వామ్యంతోనే పంచాయతీల అభివృద్ధి సాధ్యమన్నారు. తెలంగాణలో తాజా, మాజీ సర్పంచ్‌లు చేసిన అభివృద్ధికి దేశ వ్యాప్తంగా గుర్తింపు లభించిందని, అందుకనుగుణంగానే రాష్ట్రానికి ఎన్నో జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు అందాయన్నారు. తాజా, మాజీ సర్పంచ్‌ల పనితీరును వివిధ రాష్ట్రాల అధికారులు ప్రశంసించినట్లు, తెలంగాణ గ్రామాల్లో జరిగిన అభివృద్ధి దేశానికి రోల్ మాడల్ అని కితాబిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు ప్రొఫెసర్లు దిలీప్‌కుమార్ పాల్, అంజన్‌కుమార్, బాంజియా, అన్నా దొరై, అజిత్‌కుమార్, ఆశాలత, ఉపేందర్, రాజేందర్, విద్యులత పాల్గొన్నారని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పరిగి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థులంతా 30ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్నారు. పరిగిలోని జడ్పీహెచ్‌ఎస్‌నం.01లో 1995-96 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు బుధవారం పరిగిలో సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. స్కూలు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా ఒక కమిటీగా ఏర్పడి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్ణయించామని సంఘం కన్వీనర్ వెంకటేశ్‌గౌడ్ తెలిపారు.

బీఆర్ఎస్ నవాబుపేట కమిటీ ఎన్నిక

నవాబుపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టిగిద్ద గ్రామ బీఆర్ఎస్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బక్కని రాంచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చేవెళ్ల జైపాల్‌రెడ్డి, నరేందర్‌లు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా బ్యాగరి అనంతయ్య, కార్యదర్శులుగా రమేశ్, తరుణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు దాసరి సందీప్, అధికార ప్రతినిధి నవీన్, యువజన విభాగం అధ్యక్షుడు దాసరి ప్రదీప్, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా బక్కని శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు. బీసీసెల్ అధ్యక్షుడిగా ప్రశాంత్, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఆసిఫ్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గణపూరం శాంతికుమార్, గోవర్ధన్, ఇబ్రహీం, శేఖర్, రాము పాల్గొన్నారు.



నూతన కమిటీకి నియామక పత్రం అందజేస్తున్న నాయకులు


పరిగి: కులకచర్లలో నేలకొరిగిన వరి


యాలాల: ఉధృతంగా ప్రవహిస్తున్న విశ్వనాథ్‌పూర్ వాగు


ధారూరు: రుద్రారం-నాగసముందర్ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వాగు


కొడంగల్ రూరల్: టేకుల్‌కోడ్‌లో తడిసి ముద్దయిన పత్తి

భారీ వర్షం.. ఆగమాగం

మొంథా తుపాను ప్రభావంతో జోరుగా వానలు

- పొంగిపొర్లిన వాగులు వంకలు
- చెరువు, కుంటల్లో భారీగా చేరిన నీరు
- జలమయమైన రోడ్లు.. రాకపోకలకు అంతరాయం
- ఎడతెరిపి లేని వర్షంతో పంటలకు తీవ్ర నష్టం

మొంథా తుపాను ప్రభావంతో వికారాబాద్, మేడ్చల్ జిల్లాలో భారీ వర్షాలు పడుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాగులు, వంకలు పొంగిపొర్లగా చెరువులు, కుంటలు నిండుకుండను తలపిస్తున్నాయి. పంట చేతికొచ్చే సమయంలో తుపాను రావడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేలాది ఎకరాల్లో పత్తి, వరి, మొక్కజొన్న, ఉల్లి, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. యాలాల మండల పరిధిలోని కాగ్నా, తాండూరు లక్ష్మీనారాణపూర్, కాక్రవేణి నదులు, బషీరాబాద్‌లోని జుంటివాగు పొంగి ప్రవహించాయి. పలుచోట్ల రోడ్లు జలమయం కావడంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇక ఎడతెరిపిలేని వర్షంతో జనాలు ఇళ్లకే పరిమితమయ్యారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు స్కూళ్లకు సెలవు ప్రకటించడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లిన విద్యార్థులు వర్షంతో అవస్థలు పడ్డారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, అక్టోబరు 29


పూడూరు: రోడ్డుపై మన్నెగూడ మోడల్ స్కూల్ వద్ద విద్యార్థులు


పరిగి: రాఘవాపూర్‌లో దెబ్బతిన్న పత్తి


కొడంగల్/బొంరాస్‌పేట్: అలుగు పారుతున్న బొంరాస్‌పేట్ పెద్ద చెరువు


ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లోని పాత జాతీయ రహదారిపై నిలిచిన వరద


వికారాబాద్‌లో కురుస్తున్న వర్షం


ఘట్‌కేసర్: బొక్కోనిగూడ వద్ద ధాన్యం కుప్పలు


కీసర రూరల్: నాగారంలో కురుస్తున్న వర్షం

తప్పిన పెను ప్రమాదం


రేగడిమైలారం వద్ద రోడ్డు పక్కకు దూసుకెళ్లిన లారీ

కొడంగల్/బొంరాస్‌పేట్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని బురాన్‌పూర్ నుంచి మదన్‌పల్లికి వెళ్లే రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బురాన్‌పూర్ చిన్న వాగు ప్రాజెక్టు మొదటి చెరువు అలుగు వద్ద నిర్మిస్తున్న వంతెన వద్ద తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. మదన్‌పల్లి నుంచి వస్తున్న కారు మట్టి కూరుకుపోవడంతో వాగులోకి పడిపోతుండగా స్థానికులు ట్రాక్టర్ సహాయంతో కారును బయటకు తీశారు. అలాగే 163వ జాతీయ రహదారిపై రేగడిమైలారం సమీపంలో భారీ వాహనం ప్రమాదవశాత్తు రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. అప్రమత్తమైన డ్రైవర్ లారీలో నుంచి కిందికి దూకడంతో ప్రమాదం తప్పింది.

తాండూరులో రిస్క్ టీమ్

తాండూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో తాండూరు మున్సిపాలిటీ యంత్రాంగం అప్రమత్తమైంది. శానిటరీ ఇన్‌స్పెక్టర్ల నేతృత్వంలో రిస్క్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. సహాయక చర్యలు చేపట్టేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచారు.



పిడుగుపాటుకు ఆవు మృతి



పరిగి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటు ఓ ఆవు మృతి చెందింది. మండలంలోని సయ్యద్‌పల్లి గ్రామానికి చెందిన టి.చంద్రశేఖర్ తన ఆవులను గ్రామ శివారులోని పొలం దగ్గర టేకు చెట్టుకు కట్టేశాడు. బుధవారం పడిన పిడుగుపాటుకు ఆవు మృతి చెందింది. ఆవు విలువ రూ.60 వేలు ఉంటుందని ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి


ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, నాయకులు

చౌడాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేతోపాటు చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, పూడూరు, దోమ మండలాల అధ్యక్షులు సురేందర్, విజయ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాము, నాయకులు మణికంఠ, బాల్‌రాజ్ తదితరులు కలిసి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని ఓటర్లతో వారు అభ్యర్థించినట్లు తెలిపారు.

ఆలస్యంగా సెలవు ప్రకటన

(ఐదో పేజీ తరువాయి)

ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకే కట్టబెట్టింది. వర్షం తీవ్రతను ముందుగానే గుర్తించిన కలెక్టర్లు ముందుగానే తమ జిల్లాల్లో విద్యా సంస్థలకు బుధవారం ఉదయం 6 గంటలలోగా సెలవు ప్రకటించారు. కాగా, వికారాబాద్ జిల్లాలో మాత్రం పాఠశాలలు ప్రారంభమైన తర్వాత సెలవు ప్రకటించడం పట్ల తీవ్ర విమర్శలకు దారితీసింది. పాఠశాలలకు సెలవు ప్రకటించిన విషయాన్ని ఉదయం 8 గంటల లోపు విద్యా శాఖ అధికారులు ప్రకటించి ఉంటే తమకు ఇబ్బందులు తప్పి ఉండేవన్న అభిప్రాయం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది. మంగళవారం రాత్రంతా భారీ వర్షం కురవడంతో బుధవారం పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ఉండవచ్చని భావించిన పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు ఫోన్లు చేసి ఆరా తీశారు. అయితే అధికారులు సెలవు ప్రకటించలేదని, పరీక్ష కొనసాగుతుందనే విషయం తెలియజేశారు. ఎస్‌ఏ -1 పరీక్షలు కొనసాగుతుండడంతో వర్షం కురుస్తున్నా తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించారు. జిల్లాలో చాలా వరకు పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రశ్నపత్రాలు పంపిణీ చే శారు. విద్యార్థులు పరీక్ష రాసేందుకు సన్నద్ధమవుతున్న సమయంలో పాఠశాలలకు కలెక్టర్ సెలవు ప్రకటించారంటూ ఉదయం 9.15 గంటల సమయంలో విద్యాశాఖ అధికారుల నుంచి ఎంఈవోలు, ఎంఎన్‌వోలు, ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందింది. ఆ తర్వాత ఉపాధ్యాయులు, సంఘాల గ్రూపుల్లో సమాచారం వైరల్ అయింది. పాఠశాలలు ప్రారంభమైన తర్వాత సెలవు ప్రకటన వెలువడడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో విద్యార్థులు తడుస్తూ వెళ్లడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తప్పని ఇక్కట్లు

వర్షంలో ఎన్నో ఇబ్బందులకోర్చి తమ పిల్లలను పాఠశాలలకు పంపించిన గంట లోపే తిరిగి తీసుకు వెళ్లాలంటూ ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి సమాచారం రావడంతో తల్లిదండ్రులు కంగుతిన్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల లోపు పాఠశాలలకు సెలవు ఇస్తున్నట్లు ప్రకటించి ఉంటే ఎవరికీ ఇబ్బంది ఉండేది కాదని వారంటున్నారు. పిల్లలను పాఠశాలకు పంపించిన తర్వాత తల్లిదండ్రులు ఉద్యోగం, వ్యాపారం, తదితర పనులపై బయటకు వెళ్లిన వారంతా తిరిగి పాఠశాలల వద్దకు పరుగులు తీయాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. పాఠశాలలకు సెలవు ప్రకటించే పరిస్థితి ఏర్పడితే మాత్రం విద్యార్థులు తమ ఇళ్ల నుంచి పాఠశాలలకు బయలుదేరడానికి ముందుగానే జిల్లా ఉన్నతాధికారులు ప్రకటన చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సీజేఐపై దాడి చేసిన వారిని శిక్షించాలి


మాట్లాడుతున్న డప్పు మహేందర్

యాలాల, అక్టోబర్ 29(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు న్యాయమూర్తిపై దాడి జరిగి 22 రోజులైనా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరోపించారు. బుధవారం యాలాల మండలంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కార్యదర్శి డప్పు మహేందర్ మాదిగ మాట్లాడారు. న్యాయమూర్తిపై దాడి చేసిన లాయర్‌ను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 1న హైదరాబాద్‌లో జరిగే మహార్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ మండల నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మల్కప్ప, లక్ష్మణ్ నాయక్, రాయప్ప, రాములు, ముత్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవ అభినందనీయం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మధన్‌మోహన్

శామీర్‌పేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమాజ సేవలో పాల్గొనడం ప్రశంసనీయమని విశ్వవిశ్వాని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మధన్‌మోహన్ అన్నారు. మండలంలోని తూంకుంటలోని విశ్వవిశ్వాని స్కూల్ ఆఫ్ బిజినెస్(వివిఎస్‌బి)కు చెందిన విద్యార్థులు క్యాంపస్‌లో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శివారెడ్డి, కోఆర్డినేటర్లు శ్రీకాంత్‌గౌడ్, జంగయ్య ఆధ్వర్యంలో ఏడు రోజుల ఎన్‌ఎస్ఎస్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవ, హెచ్‌వోడీ ప్రొఫెసర్ గాయత్రి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


ఊరడి వెంకటేశ్

శామీర్‌పేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ నియోజకవర్గంలోని కొత్త మున్సిపాలిటీల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రభుత్వం నిధులను మంజూరు చేయడం హర్షనీయమని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఊరడి వెంకటేశ్ అన్నారు. స్థానికంగా బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు ఏ ప్రభుత్వం మంజూరి చేయని విధంగా కొత్తగా ఏర్పాటైన మున్సిపాల్టీలకు ప్రభుత్వం రూ.15 కోట్ల చొప్పున మంజూరు చేయడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలోని అలియాబాద్, మూడు చింతలపల్లి, ఎల్లంపేట మున్సిపాలిటీలకు ప్రజాప్రభుత్వం రూ.45 కోట్లను మంజూరు చేసిందని, ఈ నిధులతో ఆయా మున్సిపాలిటీలలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. నిధుల మంజూరుపై సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని గురుకుల్ విద్యాలయంలో బుధవారం పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, స్థానికులు, మున్సిపల్ సిబ్బంది కలిసి పరిసరాల పరిశుభ్రతకు శ్రీకారం చుట్టారు. దీంతో గురుకుల్ విద్యాలయం కొత్తరూపును సంతరించుకుంది. ఉదయం ఆరు గంటలకే రంగంలోకి దిగి రెండు గంటలపాటు శ్రమించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. నిత్యం గురుకులంలోకి వాకింగ్ చేయడానికి వచ్చే వారు వారంలో ఒకరోజు మైదానంలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించేందుకు కృషి చేయాలని కోరారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే వాకింగ్, వ్యాయమం, యోగా సాధన చేసుకోవడానికి ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కులకచర్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కులకచర్ల ఎస్సై రమేశ్‌కుమార్ సూచించారు. తెలంగాణ వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని, అవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని కోరారు. ఎవరూ కూడా వాగులు, చెరువులు, కుంటల వెళ్లొద్దని, విద్యుత్ స్తంభాలను తాకవద్దని సూచించారు.

క్రైం కార్నర్

గుండెపోటుతో మైనార్టీ కమిషన్ మాజీ చైర్మన్ కమ్రొద్దీన్ మృతి



ధారూరు, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ మైనార్టీ కమిషన్ చైర్మెన్ మహ్మద్ కమ్రొద్దీన్(72) గుండెపోటుతో బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని తన నివాసంలో మృతి చెందాడు. వికారాబాద్ జిల్లా, ధారూరు గ్రామానికి చెందిన కమ్రొద్దీన్ రోడ్ల భవనాల శాఖలో ఇంజనీర్-ఇన్ చీఫ్‌గా పని చేసి పదవి విరమణ పొందారు. అనంతరం ఆయన 2018లో బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్ర మైనార్టీ కమీషన్ చైర్మెన్‌గా పనిచేశారు. కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లోనే నివాసముంటున్న ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు.ఆరోగ్యం క్షీణించటంతో ఆయన మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలను కుటుంబసభ్యులు హైదరాబాద్‌లో నిర్వహించారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


లక్ష్మణ్(ఫైల్)

పెద్దేముల్, అక్టోబర్ 29(ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం రుక్మాపూర్ శివారులో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన కొత్తింటి లక్ష్మణ్(27) ప్రైవేట్ జాబ్ చేస్తుండేవాడు. బుధవారం సాయంత్రం గ్రామ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులకు విషయం తెలిసి బోరున విలపించారు. ప్రేమ వ్యవహారమే కారణం కావచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అదానీ సిమెంట్ కర్మాగారంలో కార్మికుడి మృతి


జయరామ్(ఫైల్)

తాండూరురూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మల్కాపూర్ గ్రామ శివారులోని అదానీ సిమెంట్ కర్మాగారంలో ఓ కార్మికుడు గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన తాండూరు మండలం మల్కాపూర్ శివారులోని అదానీ సిమెంట్ కర్మాగారంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ రాథోడ్ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా షాబాద్ తాలుకా బాల్యానాయక్ తండాకు చెందిన జయరామ్ రాథోడ్(55) 18 ఏళ్లుగా అదానీ సిమెంట్ కర్మాగారంలో కాంట్రాక్ట్ పద్ధతిలో లోడర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి బాత్‌రూమ్‌లో పడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించగా బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహానికి పంచనామ నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని కర్మాగారం జీఎం మోజెస్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

దోమ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన నవవధువు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన దోమ మండలంలో జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా కోస్గి మండలంలోని చంద్రవంచ గ్రామానికి చెందిన మైబమ్మ, మల్లయ్య దంపతుల కుమార్తె శ్రీలత(22)కు దోమ మండలంలోని మోత్కూర్ గ్రామానికి చెందిన మేనమామలు చిన్నయ్య, హనుమంతు ఈ నెల 26న ఫరూక్‌నగర్ మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన మల్లేశ్‌తో వివాహం జరిపించారు. వివాహం జరిగిన మరుసటి రోజు ఈ నెల 27న మేనమామల సొంత గ్రామం మోత్కూర్‌కు భార్యాభర్తలు ఇద్దరు వచ్చారు. ఈ నెల 28న మోత్కూర్‌లో శ్రీలత క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. గమనించిన మేనమామలు వెంటనే పరిగి ప్రభుత్వాసుపత్రి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై వసంతజాదవ్ తెలిపారు.

దొంగతనం కేసులో బాలుడి రిమాండ్

దోమ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాసుపల్లి కి చెందిన శ్రీశైలం ఇంట్లో దొంగతనానికి పాల్పడిన ఓ బాలుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వసంతజాదవ్ తెలిపారు. గ్రామానికి చెందిన శ్రీశైలం ఇంట్లో కొద్ది రోజుల క్రితం బాలుడు రూ.లక్షా 80 వేలు దొంగతనానికి పాల్పడ్డాడు. ఇందులో రూ.98,000 రికవరీ చేసి బాలుడిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందింది. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, మర్రిపల్లిగూడకు చెందిన మేకల జంగయ్య రోజుమాదిరిగానే బుధవారం తనకున్న పాడిగేదెలను తన వ్యవసాయ క్షేత్రంకు మేతకోసం తీసుకెళ్లాడు. మదర్‌థెరిస్సా కళాశాల సమీపంలో మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తెగి గేదెకు తగలడంతో షాక్‌తో మృత్యువాతపడింది. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోటనే దాదాపు రూ.లక్ష విలువ చేసే గేదె మృతి చెందిందని బాధిత రైతు జంగయ్య ఆరోపించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకు న్యాయం చేసి పరిహారం అందజేయాలని వేడుకున్నాడు.

జూబ్లీహిల్స్‌లో జోరుగా ప్రచారం


ఎన్నికల ప్రచారంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు,అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో తాండూరుకు చెందిన నేతలు బిజీబిజీగా ఉన్నారు. ఆయా పార్టీలు వార్డులు, కాలనీల వారీగా ప్రచార బాధ్యతలు తాండూరు నేతలకు అప్పగించారు. వెంగల్‌రావు డివిజన్‌లోని యాదగిరి నగర్‌లో కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జిగా తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఈ నెల 31 వెంగల్‌రావునగర్ డివిజన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షో ఏర్పాట్లను వర్ధనపేట ఎమ్మెల్యే నాగరాజ్‌తో కలిసి పరిశీలించారు. అంతకుముందు బూత్ నం.141 నుంచి 145 వరకు బూత్ కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, అజయ్ ప్రసాద్, కిరణ్ రోనాల్డ్, తదితరులు ఉన్నారు. బీఆర్ఎస్ తరఫున తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి శ్రీనగర్ కాలనీలోని బూత్ నం.283 నుంచి 292 వరకు ప్రచారం నిర్వహిస్తున్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ యూసుఫ్‌గూడ డివిజన్‌లోని వెంకటగిరి ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. వారివెంట తాండూరుకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా కన్వీనర్ కరుణం ప్రహ్లాదరావు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు యు. రమేష్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణం ముదిరాజ్, కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, నాయకులు బొప్పి శ్రీహరి తదితరులు రెండు రోజులుగా జూబ్లీహిల్స్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.